రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# సంచిలో నవజాత శిశువు లభ్యం

**-కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**శంషాబాద్ జులై 21, ప్రభాతవార్త :** ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచిలో గుర్తు తెలియని నవజాత ఆడ శిశువు లభ్యమైన ఘటన కలకలం రేపింది. ఎస్ఐ ఇంద్ర వివరాల ప్రకారం... శంషాబాద్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్, ఎయిర్‌పోర్ట్ కాలనీ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని నవజాత ఆడ శిశువును సంచిలో వదిలేసి వెళ్లినట్లు మంగళవారం ఉదయం 11:30 గంటలకు పోలీసులకు సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆ శిశువు ఒకటి లేదా రెండు రోజుల క్రితం జన్మించి ఉండవచ్చని గుర్తించారు. వెంటనే ఆ శిశువును శంషాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన సంరక్షణ కోసం అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌కు తరలించడం జరిగింది. నవజాత శిశువును నిర్లక్ష్యంగా వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.. ఈ నవజాత ఆడ శిశువుకు సంబంధించిన వివరాలు



ఎవరికైనా తెలిసిన పక్షంలో, దయచేసి వెంటనే ఆర్‌జిఐఎ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

# లేట్ చేస్తే... వేటే



- ★వేగం పెంచాల్సిందే
- ★నెలావారీ నివేదికలు పంపండి
- ★అలసత్వానికి తావు లేదు
- ★ఎడ్యుకేషన్ హబ్ ఆలస్యంపై సీఎం సీరియస్
- ★భూములు కోల్పోయిన రైతులకు వారంలోగా ప్లాట్ల పట్టాలు అందించాలని ఆదేశం

**కొడంగల్, జులై 21 ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా దుద్యాల మండలంలోని హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనుల మందగమనంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని నివాసంలో కొడంగల్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై సీఎం సమీక్షా సమావేశం నిర్వహించి తగిన దిశా నిర్దేశం చేశారు. ముందుగా ఎడ్యుకేషన్ హబ్ పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీ, హాస్టల్స్, మెడికల్ కాలేజీ, వెటర్నరీ కాలేజీల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జరుగుతున్న ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, నిర్మాణ పనుల వేగం పెంచాలని ఆదేశించారు. ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి నెలావారీ ప్రగతి వివరాలను ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, నిరక్ష ్యంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వచ్చే వారంలోగా బాధితులకు ప్లాట్ల పట్టాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

**ఎత్తిపోతల పథకాల వేగవంతానికి స్పెషల్ టీమ్స్**

అనంతరం ఇరిగేషన్ శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటికీ వర్క్ ఆర్డర్లు ఇచ్చి వెంటనే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, సెప్టెంబర్ నాటికి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. మూడో పంపు ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నీ వేగంగా జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఫేజ్1 పనులకు వచ్చే ఏడాది డిసెంబర్ వరకే గడువు**

ఫేజ్1 పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు సీఎం దృష్టికి తీసుకురాగా, డిసెంబర్ 2027 నాటికి ప్రతి నెల ఎంతవరకు పనులు పూర్తి చేస్తారో సంతకాలతో కూడిన వివరాలను అందజేయాలని ఆదేశించారు. పనుల విషయంలో తప్పుడు సమాచారం ఇస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి.కె. శ్రీదేవి, వైద్యకుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్. చోంగ్తూ, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ సెక్రటరీ శ్రీధర్, కార్పొరేషన్ ఎండి శశాంక్, కడా స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, రాష్ట్ర స్థాయి ఇంజనీర్లు మరియు సంబంధిత శాఖల హెచ్ఓడీలు పాల్గొన్నారు.

## కొడంగల్ టూ శంషాబాద్

### ముంబై-పూణె కనెక్టివిటీ తరహాలో రోడ్డు అనుసంధానం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి/దుద్యాల, జూలై 21, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంబై-పుణే కనెక్టివిటీ తరహాలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కొడంగల్ వరకు వేగవంతమైన రోడ్డు అనుసంధానం కల్పించే రేడియల్ రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ రహదారి పూర్తయితే హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్, ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్కులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు. దుద్యాల వద్ద మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండస్ట్రియల్ పార్కులకు, ఎడ్యుకేషన్ హబ్‌కు 10 వేల ఎకరాల భూములు సేకరించాలని సీఎం ఆదేశించారు. రేడియల్ రోడ్డు కోసం కూడా భూసేకరణ చేపట్టాలన్నారు. ప్రభుత్వ సంకల్పం నెరవేర్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలో చేపడుతున్న రహదారుల పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**నాకు అన్ని రోడ్లు తెలుసు**

**అవసరమైతే ప్రతి సందు తనిఖీ చేస్తా**

నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో అవసరమైన ఆర్ అండ్ బి రహదారులను గుర్తించేందుకు ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్ల మంజూరు, నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించి నెలరోజుల పాటు అన్ని మండలాల్లో పర్యటించి నివేదిక సమర్పించాలని సూచించారు. 2028 జూన్ 2 నాటికి నియోజకవర్గంలో ఆర్ అండ్ బి రహదారుల అభివృద్ధిని పూర్తి చేసేలా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. "నాకు నియోజకవర్గంలోని ప్రతి రోడ్డు తెలుసు. అవసరమైతే ప్రతి సందు, ప్రతి వీధి తిరిగి పరిశీలిస్తాను. ప్రతి తండాకు నాణ్యమైన రహదారి ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు.



పంచాయతీ రాజ్ అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న గిరిజన నేతలు

## మాతండాను మేమే ఏలుకోవాలి

**సిడి తాండ పంచాయతీలో ఎస్టీల ఓట్లే ఉండాలని గిరిజన నేతలు డిమాండ్**

**నందిగామ, జులై 21, ప్రభాతవార్త :** మా తండాలో మా రాజ్యం రావాలంటే ఎస్టి ఓటర్లే ఉండాలని, ఉపాధి కోసం వచ్చిన స్థానికేతర్ల ఓట్లు తీసేయాలని మంగళవారం ఉదయం నందిగామ మండలం సిడి త్నాడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న తాటిగడ్డ తండా, ధన్సింగ్ తండా, వంపుతండా గ్రామాల ప్రజాప్రతినిధులు గిరిజన నేతలు జిపిఓ వేణుగోపాల్ , బిఎల్ఓ సంతోష లకు లిఖితపూర్వక వినతి పత్రం సమర్పించారు. కొందరు బిఎల్ఓలు అత్యుత్సాహం ప్రదర్శించి స్థానికేతర్ల ఓట్లు సర్‌లో నమోదు చేయడాన్ని వారు తప్పు పట్టారు. గిరిజన గ్రామపంచాయతీలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ఉంటే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, మా గ్రామ పంచాయతీ ఓటరు జాబితా నుండి స్థానికేతర్ల ఓట్లు తీసేయాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గబ్రు చౌహాన్, మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, గిరిజన నేతలు మోహన్ సింగ్, చందర్, జటావత్ రాందాస్, పాతలావత్ ల్నిబియా, రూప్ సింగ్, వార్డు సభ్యులు రాజేష్, జటావత్ మాధవి లక్ష ్మణ్ నాయక్, బుజ్జి శంకర్ నాయక్, శాంతి శ్రీను, పాతలవత్ శ్రీను నాయక్, పత్తి శీను, నగేష్, మాజీ వార్డు సభ్యుడు శ్రీను నాయక్, మల్లేష్ నాయక్, జె రెడ్యా, రాములు నాయక్, పరుశురాం, ధనరాజ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ మోడ్‌లో పనిచేయండి

**ప్రత్యామ్నాయ పంటలు, తాగునీరు, పశుగ్రాసం తదితర సేవలపై సమగ్ర కార్యాచరణ**

**శాఖాధిపతులకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశం**



ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

**రంగారెడ్డిఅర్బన్, జులై 21 ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలను పూర్తిగా అడ్డుకోవడం సాధ్యం కాకపోయినా ముందస్తు ప్రణాళికలు, సమర్థవంతమైన కార్యాచరణ, శాఖల మధ్య సమన్వయం ద్వారా వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రతి శాఖ మిషన్ మోడ్‌లో పనిచేసి ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని తమ తమ శాఖల కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. స్పీకర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందుగానే కంటింజెన్సీ ప్రణాళికలను సిద్ధం చేసుకుని అమలు చేయాలని సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, భూగర్భ జలాలు, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలని, మండల స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు సూచనలు అందించాలని చెప్పారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పెసర, కంది, జొన్న, రాగులు, సజ్జలు వంటి పంటలను ప్రోత్సహించాలని, అవసరమైన విత్తనాలను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు అవసరమైన సాంకేతిక >>2



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## శాకంబరీ దేవిగా వాసవీ మాత దర్శనం

**షాద్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆషాఢ మాసం తొలి మంగళ వారం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా సంఘం షాద్నగర్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరీ దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాసు పంతులు వేదమంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాకంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చిన వాసవి మాతను దర్శించుకునేందుకు మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పూలు, పండ్లు, కూరగాయలతో విశేష అలంకరణ చేయడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

**కల్వకుర్తిని జిల్లాలో అగ్రస్థానంలో నిలిపితే**

## రూ.లక్ష విరాళం ఇస్తా

**తలకొండపల్లి , జులై 20, ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపితే లక్ష రూపాయల విరాళంగా అందజేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో కల్వకుర్తి నియోజకవర్గం అగ్రస్థానంలో కొనసాగుతోందని, వచ్చే నెల 3వ తేదీతో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు ముగిసేలోపు ఉమ్మడి పాలమూరు జిల్లాలోనూ మొదటి స్థానాన్ని సాధించేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బిఎల్ఎలను, సూపర్వైజర్‌లను ప్రోత్సహిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలనీ ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో సత్యనారాయణ స్వామి వ్రతం, యజ్ఞ మహోత్సవ కార్యక్రమం ముగిసిన అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, కల్వకుర్తి ఎస్ఐఆర్ ఇంచార్జ్ సంధ్యా రెడ్డిలు మాట్లాడుతూ... ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని, ఎవ్వరూ మిగిలిపోకుండా నమోదు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా ఆమనగల్, కల్వకుర్తి బ్లాక్‌ల పరిధిలో పనిచేస్తున్న బిఎల్ఎ, సూపర్వైజర్లను గుర్తించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. >>2



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఖాళీ సీట్లు కౌన్సిలింగ్ ద్వారా భర్తీ

**గిరిజన గురుకుల విద్యా సంస్థల రీజినల్ కోఆర్డినేటర్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 21, ప్రభాతవార్త :** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల ఆధ్వర్యంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగ ఉన్న సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి రీజియన్ రీజినల్ కోఆర్డినేటర్ పేర్కొన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని గురుకుల విద్యాలయాల్లో 2026-2027 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న పరిమిత ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. 5వతరగతిలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు అన్ని కేటగిరిల అభ్యర్థులకు 6వతరగతి నుంచి 9వతరగతి వరకు గిరిజన (ఎస్‌టి) విద్యార్థినిలకు మాత్రమే స్పాట్ అడ్మిషన్స్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ నెల 27వ తేదీన సోమవారం ఉదయం 10గంటలకు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలుర) జిన్నారం సంగారెడ్డి జిల్లా నందు నిర్వహించబడే స్పాట్ అడ్మిషన్స్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని రీజినల్ కోఆర్డినేటర్ కోరారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లలో గంజాయి కలకలం

**★400 గ్రాముల గంజాయి స్వాధీనం, నిందితుడి అరెస్టు**

**ధారూర్, జులై 21, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రం లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ ప్రాంతంలో గంజాయి విక్రయి స్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జరిపిన మెరుపు దాడిలో గంజాయి స్వాధీనం చేసకొని ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ధారూర్ సిఐ రఘురాం వెల్లడించిన ప్రకారం. మండల కేంద్రానికి చెందిన దత్తాత్రేయ (20) అనే యువ కుడు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ ప్రాంతం నుంచి అక్రమంగా గంజాయిని కొనుగోలు చేసి తీసుకొస్తున్నాడు. దీనిని ధారూర్ ఎస్ఐ2 గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ రెడ్యా నాయక్, అనంతయ్య సిబ్బంది చాంద్ పాషాలు సంయుక్తంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడు దత్తాత్రేయ వద్ద నుంచి 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు విచారణ అనంతరం మంగళవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రఘురాం తెలిపారు. యువత పెడదోవ పట్టి గంజాయికి బానిసలైతే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామాలో గంజాయి విక్రయాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



మధ్యాహ్నం సమయం అయినా అందుబాటులో లేని అధికారి

## సార్ ఎప్పుడొస్తారు?

**ఫరూక్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పడిగాపులు**

**షాద్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మధ్యాహ్నం కావస్తున్న అధికారి ఇంకా పత్తాకులేరు.

ఇటీవల ఫరూక్ నగర్ సబ్ రిజిస్టర్ అధికారి శ్రీనివాస్ అనారోగ్యంతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్చార్జిగా షాద్ నగర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న వికాస్ రెడ్డికి ఇన్చార్జి బాధ్యతలు అప్ప చెప్పారు. అయితే సీనియర్ అసిస్టెంట్ వికాస్ రెడ్డి ఇప్పటివరకు రాకపోవడంతో పలువురు ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ జీతాలు తీసుకొని మధ్యాహ్నం 12 గంటల వరకు ఉద్యోగానికి రాకపోవడం ఏమిటంటే ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్లాట్ బుక్ చేసుకుని సమయానుకూలంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల నుకునేవారు ఇతర పనులపై వెళ్లిపోవాలనుకునేవారు ఈ సార్ కోసం ఎదురుచూస్తున్నారు. ఉదయం 10:30 గంటలకు మొదటి స్లాట్ రిజిస్ట్రేషన్ జరగాలి వికాస్ రెడ్డి మాత్రం నుండి 11 : 45 వరకు కార్యాలయానికి చేరుకోలేదు.. ఇప్పుడే దర్జాగా వచ్చి 12 గంటలకు ఆయన మొదటి స్లాట్ స్టార్ట్ చేస్తారు.. వీళ్ల అధికారుల లేక జమీందారుల అర్థం కావడం లేదని ప్రజలు గునుగుతున్నారు.

**సిఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని..**

## బిఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు

**శామీర్‌పేట, జులై 21, ప్రభాతవార్త :** ఎల్‌బి నగర్‌లో జరిగిన బిఆర్ఎస్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డిపై, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బిఆర్ఎస్ నాయకులు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు జీనోమ్‌వ్యాలీ పోలీస స్టేషన్‌లో, శామీర్‌పేట పోలీస్ స్టేషన్ లోనూ ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తంటం రాము, ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, మూడు చింతలపల్లి మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అద్యక్షులు శ్రీకాంత్‌గౌడ్‌లు తెలిపారు.



ఫిర్యాదు చేస్తున్న మేడ్చల్ యువజన కాంగ్రెస్ నాయకులు

### బిఎల్ఎల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలి

**పెద్దేముల్, జులై 21, ప్రభాతవార్త:** ఈ నెల 23న ఆయా మండలాల వారిగా బిఎల్ఎ (బూత్ లెవల్ ఏజెంట్ల) సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ ఎస్ఐఆర్ (సర్) తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కరణం పురుషోత్తంరావు మాట్లాడుతూజిల్లా సమావేశానికి ఎస్ఐఆర్ పర్యవేక్షకులుగా టిపిసిసి కోటిం వినయ్‌రెడ్డి, జగదీశ్వర్‌రావు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ పాల్గొంటారని అన్నారు. ఉదయం 9-30 గంటలకు తాండూరు పట్టణం, 11-00 గంటలకు బషీరాబాద్, మధ్యాహ్నం 12-30 గంటలకు యాలాల్, 2-30 గంటలకు తాండూరు రూరల్, 4-00 గంటలకు పెద్దేముల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇట్టి కార్యక్రమానికి మండలపార్టీ అధ్యక్షులు, బిఎల్ఎలు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు విధిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు

**జిల్లేడు చౌదరిగూడ, జులై 21, ప్రభాతవార్త :** అందరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా కృషి చేస్తానని చేనేత రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ అన్నారు. మంగళవారం జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలో మిక్స్ డు ఫ్యాక్టరీ చేనేత సహకార సంఘము ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీర మోహన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందరికి అందేవిధంగా కృషి చేస్తాని అన్నారు. షెడ్ల నిర్మాణం, పెన్షన్స్ ,అర్హులందరికీ ఇండ్లు వచ్చే విధంగా కృషిచేస్తానని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గున్నాల చంద్ర శేఖర్,గౌరవ అధ్యక్షులుగా మచ్చ సుధాకర్ రావు, కార్యదర్శిగా పోట్ల లక్ష్మణ్,ఉపాధ్యక్షులుగా అమృతం ప్రభాకర్, కోశాధికారి గా పాగుల స్వామి, డైరెక్టర్లుగా తడూరి రమేష్,మధునాల యాదయ్య, ఆలుగొండ వసంత, వర్కల శివరాజు, గట్టుపల్లి పార్వతమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గూడ వెంకట స్వామి, అచ్చుగట్ల నరేందర్, పాదనగర్ ఉన్ని సంఘము అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహంలో బోర్ డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

**షాద్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ 2వ వార్డు పరిధిలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించేందుకు బోర్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ సులోచన, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన ఈ పనులను షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వేశ్వర్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బోర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, ప్రిన్సిపాల్ సులోచన, కౌన్సిలర్ బచ్చలి నరేష్, పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, ముబారక్ అలీఖాన్, తంగడపల్లి శంకర్, క్యాసాట్ శ్రీనివాస్, రమేష్ గౌడ్, రామచందర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మిషన్ మోడ్‌లో పనిచేయండి

(మొదటి పేజీ తరువాయి)

సలహాలను ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పీకర్ స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు తవ్వించడం, పనిచేయని బోర్లను మరమ్మతు చేయడం,తాగునీటి బోర్లకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం, చెరువులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.పశుసంవర్ధక శాఖ పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందుగానే మేత నిల్వలు సిద్ధం చేయాలని, అవసరమైతే ప్రత్యేక మేత కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.పశువైద్య సేవలను మరింత బలోపేతం చేసి గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులను విస్తృతంగా చేపట్టి రైతు కూలీలకు ఉపాధి కల్పించాలని చెరువుల పూడికతీత,ఊటకుంటలు, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటల ఎంపిక విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే పంటలు,ఉద్యాన పంటలు, పండ్ల తోటలు,పూల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ప్రాంతాల్లో వరి సాగు ఎక్కువగా ఉండటంతో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల యాక్షన్ ప్లాన్‌లు,కంటింజెన్సీ ప్రణాళికలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు కలిసి తెలంగాణ జలసిరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్లు సవ్యసాచి,వికాస్ రాజ్,ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి,కాలే యాదయ్య,వీర్లపల్లి శంకర్, మనోహర్ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి,మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్సీ దయానంద్, అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, డీఆర్ఓ శారద, మున్సిపల్ చైర్మన్లు, ఆర్డీఓలు, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, మున్సిపల్,రెవెన్యూ, వైద్య ఆరోగ్య, భూగర్భ జలాలు, నీటిపారుదల తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రూ. లక్ష విరాళం ఇస్తా

(మొదటి పేజీ తరువాయి)

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సూపర్వైజర్లను గుర్తించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేసి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి గ్రామంలో వందశాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే చేసిన పిలుపుకు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కల్వకుర్తిని నంబర్-1 స్థానంలో నిలబెట్టేందుకు సమష్టిగా పనిచేస్తామని నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ గీతా నరసింహ, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కేశవరెడ్డి, బ్లాక్ స్థాయి మహిళా అధ్యక్షురాలు రమాదేవి, సర్పంచులు రామ లక్ష్మణ్, భారతమ్మ గోపాల్,రమేష్, రాజు నాయక్,డిసిసి ప్రధాన కార్యదర్శి రఘురాములు, నాయకుల డేవిడ్, రాఘవేందర్ యాదవ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### మండల కాంగ్రెస్ అధ్యక్షునిగా పతాప్‌రెడ్డి నియామకం

**కందుకూరు, జులై 21, ప్రభాతవార్త:** కందుకూరు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులుగా లేమూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోర్పోల్ రాణా ప్రతాప్ రెడ్డిని నియమిస్తూ టీజీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామక పత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా, మండల కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షులుగా వివిధ హోదాలలో పనిచేసిన రాణా ప్రతాప్ రెడ్డిని మండల శాఖ అధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మండల శాఖ అధ్యక్షులుగా రాష్ట్ర పార్టీ నియమించడం బాధ్యతలను మరింత పెంచిందని రాష్ట్ర పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని గ్రామాల వారీగా గ్రామ శాఖలను అనుబంధ సంఘాలను ఏర్పాటు చేస్తూ అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందేలా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పార్టీ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

## వైభవంగా సుదర్శన పెరుమాళ్ తిరునక్షత్ర మహోత్సవం



సమతామూర్తి ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**శంషాబాద్ జులై 21, ప్రభాతవార్త :** శంషాబాద్‌లోని స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో మంగళశారం శ్రీసుదర్శన పెరుమాళ్ "తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు.శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి దివ్య మంగళాశాసనములతో విశ్వశాంతిని, లోకక్షేమాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా సమతామూర్తి కేంద్రంలో శ్రీసుదర్శన మహా మంత్ర హోమం ఘనంగా నిర్వహించారు. రుత్విక్కుల వేద మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, పూర్ణాహుతి, మంగళాశాసనం మరియు వేద ఆశీర్వచనం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.అనంతరం భక్తులందరికీ తీర్థ, ప్రసాద గోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సుదర్శన జయంతి ఉత్సవాన్ని కళ్లారా తిలకించి, భగవంతుని కృపకు పాత్రులు కావడానికి నగర నలుమూలల నుండి భక్తులు విశేష సంఖ్యలో తరలిరావడంతో సమతామూర్తి ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో కిక్కిరిసిపోయింది. భక్తుల గోవింద నామస్మరణలతో మారుమోగింది.

## వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ధారూర్, జులై 21, ప్రభాతవార్త:** రైతులకు సాగునీరు. ఎరువుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. మంగళవారం ధారూర్ మండలంలోని గడ్డమీది గంగారం, దోర్నాల్ గ్రామాల్లో పర్యటించి ఆయన స్థానిక బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు.

గత ప్రభుత్వ హయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తుత పాలన తీరును ఆయన బేరీజు వేస్తు పలు అంశాలను ప్రస్తావించారు. మిషన్ భగిరథ నీటి సరఫరా సక్రమంగా లేదని, ఒకవేళ పథకాల పేర్లు మార్చాలని భావిస్తే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కేసిఆర్ కిట్లు, సంక్షేమ చెక్కుల పంపిణి వంటి కార్యక్రమాలను గతంలో తాను నియోజకవర్గంలో ఎలా అమలు చేసింది గుర్తుచేశారు. వికారాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా అంశంపై స్పందిస్తు ఇతర ప్రాంతాలతో సమానంగా ఇక్కడ నాణ్యమైన కరెంటు అందేలా చూడాల్సిన భాధ్యత స్థానిక నాయకత్వంపై ఉందని పేర్కొన్నారు. కేవలం రాజకీయ విమర్శలు చేయడం మాని, ఇప్పటి వరకు నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి ఎమిటో స్పష్టం చేస్తు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం దోర్నాల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బిజేపి, కాంగ్రెస్ పార్టీలను వీడి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన గులాబి కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొంకలి కిష్టప్ప, శ్రీనివాస్, జగదీష్, అనిల్, మహిపాల్, నగేష్, సాయులు, వెంకటయ్య, నర్సిములు, ఖాజమియ్య, షపి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, దేవేందర్ నాయక్, రహంతుల్లా ఖాన్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

**షాద్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో నంబర్ 641ను వెంటనే ఉపసంహరించుకోవాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ నిర్మాణానికి వ్యతిరేకంగా మంగళవారం స్థానిక సిద్ధాపూర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, కొత్తూరు మండల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితర నేతలతో కలిసి చౌలపల్లి ప్రతాప్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను స్వయంగా వివరించేందుకు ప్రయత్నించారు. అయితే కలెక్టర్ మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా సమీక్ష సమావేశంలో ఉండటంతో,



కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి తదితరులు

మరుసటి రోజు కలవాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. జీవో నంబర్ 641ను వెనక్కి తీసుకుని సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకునే విషయంలో ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ప్రభుత్వం కచ్చితంగా జీవో 641ను వెనక్కి తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ వెలుపల కాలుష్యకర పరిశ్రమలు, ఇతర ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించి నిర్ణయాలు తీసుకుని భూసేకరణ చేపట్టిందని, వాస్తవాలు అందరికీ తెలుసని అన్నారు. ఈ విషయంలో అనవసరంగా కాంగ్రెస్ పార్టీపై బురదజల్లడం సరికాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తమ డిమాండ్‌ను అంగీకరిస్తారనే నమ్మకం ఉందని, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూడా జీవో రద్దు కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తెలిపారు.

### 60 శాతం ఎమ్యూనరేషన్ ఫారాల సమర్పణ

**ఘట్‌కేసర్, జులై 21, ప్రభాతవార్త:** ఎమ్యూనరేషన్ ఫారాలను పూర్తి చేసిన ప్రజలు బిఎల్ఓలకు అందజేయాలని ఘట్‌కేసర్ సర్కిల్ ఎఎంసీ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలోని ఇడబ్ల్యుఎస్‌కాలనీ, బాలాజీనగర్, గాంధీనగర్‌లోని పలు బూత్‌లలో మంగళవారం కాంగ్రెస్‌పార్టీ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఫారాల స్వీకరణ కేంద్రాలను సందర్శించి బిఎల్ఓ, బిఎల్ఏలతో మాట్లాడి ఎమ్యూనరేషన్ ఫారాల నింపడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆయా కాలనీల్లో 60 శాతం వరకు ఫారలను బిఎల్ఓలకు అందించడం జరిగిందని స్థానిక నాయకులు ఎంఎంసీకి తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, సర్ సమన్వయకర్తలు జాన్‌పాషా, సాయికిరణ్, గడ్డిఅన్నారం



ఎమ్యూనరేషన్ ఫారాలు స్వీకరిస్తున్న ఎఎంసీ వేణుగోపాల్‌రెడ్డి

మార్కెట్ కమిటటీ డైరక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా సొసైటీ సభ్యులు మొదబోయిన వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు కడపోల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, మీసాల సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, కాలనీ నాయకులు కేశవపట్నం అంజనేయులు, శశిధరణ్, జె.నాగభూషణంచారీ, గోరకంటి రవీందర్, కె.సత్యనారాయణ, బిఎల్ఏలు సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్, ఎస్‌కె.వాజీద్, అశ్రఫ్, ఓ.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి రూ.1.16 లక్షల ఆర్థిక సాయం

**మాడ్గుల, జులై 21,ప్రభాతవార్త:** మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లేటి జనార్దన్ అకాల మరణంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు అప్పారెడ్డిపల్లి గ్రామస్థులు,చుట్టుపక్కల గ్రామాల ప్రజలు,మానవతావాదులు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వచ్ఛందంగా క్రౌడ్ ఫండింగ్ నిర్వహించి తమకు తోచినంత విరాళాలు అందించారు.ఈ క్రౌడ్ ఫండింగ్ ద్వారా మొత్తం రూ.1,16,511 సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. సేకరించిన మొత్తాన్ని దాతల పూర్తి వివరాలతో కలిసి జనార్దన్ భార్య పల్లేటి కవితకు అందజేసి, ఆమె పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నట్లు ప్రకటించారు. కుటుంబానికి భవిష్యత్తులో కొంత ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు,దాతలు అదనంగా ఆర్థిక సహాయం కూడా అందించారు.మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ రూ.5వేలు విరాళం అందించగా, అంత్యక్రియల రోజున పాపిశెట్టి రాము రూ.5వేలు ఉప్పల వెంకటేష్ రూ.3వేలు, గోవిందు శ్రీధర్ రూ.2వేలు, దివంగత బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ రామిరెడ్డి కుటుంబ సభ్యులు రూ.5వేలు చొప్పున జనార్దన్ భార్య కవితకు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందు శ్రీధర్ మాట్లాడుతూ ఒక కుటుంబం ఆపదలో ఉన్నప్పుడు సమాజం అంతా ఒక్కటై నిలబడితే బాధితులకు ఎంతో ధైర్యం కలుగుతుందని అన్నారు. గ్రామస్థులు,దాతలు చూపిన మానవత్వం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందు నరేందర్,అప్పారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ తోట చంద్రయ్య, పల్లేటి యాదయ్య, తోట పాపయ్య, తెలుగు చంద్రయ్య,అడవి రాములు, పల్లేటి నర్సింహా, ప్రకాష్, పాలది సైదులు,వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### యాచారం మండలంలో ఎరువుల కొరత లేదు

**యాచారం జులై21, ప్రభాతవార్త :** ప్రస్తుత 2026 వానకాలం సీజన్‌కు సంబంధించి యాచారం మండలంలో ఎలాంటి ఎరువుల కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సాగుచేస్తున్న రైతులందరికీ యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటాయని, ఎరువుల సరఫరా అనేది నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.ఈ సీజన్ నుండి సబ్సిడీ ఎరువుల కొనుగోలు ప్రక్రియను మరింత పారదర్శకంగా నిర్వహించడానికి "ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్స్"యాప్‌ను వినియోగిస్తున్నట్లు ఎంఏఓ రవినాథ్ వివరించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ స్వీయ ధృవీకరణ ద్వారా మాత్రమే ఎరువులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని, డీలర్లు స్వయంగా బుక్ చేయడానికి అనుమతి లేదన్నారు. అయితే, రైతులకు బుకింగ్ విధానంపై అవగాహన కల్పించేందుకు మరియు బుక్ చేసుకోవడంలో సహాయపడటానికి డీలర్లు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. డీలర్లకు అవసరమైన ఎరువుల నిల్వలను కంపెనీల నుండి ఇండెంట్ పెట్టి తెప్పించుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.ఈ యాప్ వినియోగంపై మండలంలోని లైసెన్స్ కలిగిన డీలర్లు, వాలంటీర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మీసేవ, సీఎస్‌సీ కేంద్రాల నిర్వాహకులు మరియు గ్రామసభల్లో పాల్గొన్న రైతులకు ఇప్పటికే సమగ్ర అవగాహన కల్పించామని తెలిపారు. పంపిణీ పారదర్శకత కోసం ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో "నిఘా సమిత్తిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల నేలలో తగినంత తేమ ఉండకపోవచ్చని, కాబట్టి రైతులు నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేయడం ద్వారా పంటలను కాపాడుకోవాలని సూచించారు. అలాగే, ఈ వానకాలంలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు తమ సాగు విస్తీర్ణానికి అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు కొనుగోలు చేస్తూ, తోటి రైతులకు సహకరించాలని కోరారు. సందేహాలు, సాంకేతిక సలహాల కోసం మండల వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించవచ్చని ఎంఏఓ రవినాథ్ తెలిపారు.

### మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

**జిల్లేడుచౌదరి గూడెం, జులై 21, ప్రభాతవార్త:** గ్రామంలో నాటిన మొక్క లను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎలుకగూడెం సర్పంచ్ బందయ్య అన్నారు. మంగళవారం గ్రామంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొక్కలు పెంచేందుకు ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు లింగ సమానత్వంపై అవగాహన

**యాచారం జులై21, ప్రభాతవార్త :** విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా యాచారం మండల కేంద్రం లో ఉన్న శంషా బాద్ గురుకుల బాలుర పాఠశాలలో వాయిస్ 4 సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బాయ్స్ ఫర్ చేంజ్ కార్యక్రమం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ శిక్షణా శిబిరంలో పాఠశాలకు చెందిన 160 మంది విద్యార్థులు చురుగ్గా పాల్గొని లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యం, యుక్తవయస్సులో వచ్చే మార్పులు, మహిళల పట్ల గౌరవం వంటి సామాజికాంశాలపై విస్తృత అవగాహన పెంపొందించుకున్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, పరస్పర గౌరవం, సమానత్వ భావనలను చిన్నతనం నుంచే అలవర్చడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి. నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ కె. పందు నాయక్ మాట్లాడుతూ, ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు ఎంతో తోడ్పడతాయని, వారిని సమాజానికి ఆదర్శవంతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు.

### నూతన మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇవ్వాలి

**యాచారం జులై21, ప్రభాతవార్త :** యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్క్ (ఫ్యూచర్ సిటీ) భూసేకరణ సర్వేలో జరిగిన అవకతవకలకు నిరసనగా, తెలంగాణ రాష్ట్ర భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ చేపట్టిన నిరాహార దీక్ష రెండవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండా అక్రమంగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. రైతుల కబ్జాలో ఉన్న భూములకు, రికార్డులకు పొంతన లేకుండా చేస్తూ పేద రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్‌తో రీసర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్వే నెంబర్లు, బాధిత రైతుల వివరాలతో కూడిన పూర్తి జాబితాను పారదర్శకంగా ప్రదర్శించాలని కోరారు. పాత ధరలతో కాకుండా ప్రస్తుత నూతన మార్కెట్ విలువ ప్రకారమే రైతులకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని, అంతవరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ దీక్షకు స్థానిక రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతును ప్రకటించారు.

### వ్యక్తి అనుమానాస్పద మృతి

**నందిగామ, జులై 21, ప్రభాతవార్త :** నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామంలో భాస్కర్ (47) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది, స్థానిక ఎస్ హెచ్ ఓ ప్రసాద్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తి రోజు తాగి భార్యతో గొడవపడేవాడని , రోజువారి క్రమంలో మద్యం సేవించి భార్యతో గొడవ పడినట్లు మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొంది. గొడవ పడుతున్నాడని ఇంటి తలుపు తీయలేదని కాసేపు అయ్యాక చూస్తే ఇంటి మెట్ల మీద పడి ఉన్నట్లు సత్వరమే తన కుమారునికి జరిగిన విషయం తెలిపి 108 అంబులెన్స్ కు ఫోన్ చేసి పిలిపించగా వారు భాస్కర్ చనిపోయినట్లు నిర్ధారించారని ఫిర్యాదులో వెల్లడించారు. ఈ సంఘటన విషయమై మృతుని భార్య ఫిర్యాదు మేరకు నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఏది ఏమైనా మృతుడు భాస్కర్ ముఖంపై ఉన్న గాయాలతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

### అర్హత కల్గిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 21, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ పరిధిలోని చౌదరిగూడలో సర్ ప్రక్రియను స్థానిక కాంగ్రెస్ నాయకులు మంగళవారం పర్యవేక్షించారు. చౌదరిగూడలోని పలు కాలనీలో కాంగ్రెస్ నేతలు భోజిరెడ్డి, పసులాది నర్సింగ్‌రావు ముదిరాజ్ తదితరులు బీఎల్‌వోలతో కలిసి పర్యటించారు. సర్ ప్రక్రియలో ఓటర్లకు దరఖాస్తులు నింపడంలో సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కల్గిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని అన్నారు. సర్ పేరుతో ఓట్లను తొలగిస్తే సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్ కాంగ్రెస్ మాజీ వార్డు సభ్యులు ఎం. సుధాకర్, పసులాది నర్సింగ్‌రావు, భోజిరెడ్డి తదితరులున్నారు.

### 23న ఆలయ చైర్మన్ ప్రమాణస్వీకారం

**కుల్కచర్ల, జులై 21 ప్రభాతవార్త:** పాంబండ ఆలయ కోట్ల మహిపాల్‌రెడ్డి చైర్మన్ ప్రమాస్వీరం విజయవంతం చేయాలని పిఎసిఎస్ చైర్మన్ భీంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక నాయకుల నాయకులతో సమావేశం నిర్వహనించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఈ నెల 23 బుధవారం 10 గంటలకు ఎమ్మెల రామ్మోహన్ రెడ్డి హాజరైవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాని విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్, అయ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎఐటియుసి మహాసభను జయప్రదం చేయండి

**శంషాబాద్, జులై 21, ప్రభాతవార్త :** ఆగస్టు 2న తుక్కుగూడలో నిర్వహించే ఎఐటియుసి జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పేర్కొన్నారు. మంగళవారం మహాసభల గోడపత్రికలను శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పాను గంటి పర్వతాలు మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లాపరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయి. కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ ,మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, కే చందు యాదవ్, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి, మంజుల, రాములు, తదితరులు పాల్గొన్నారు.

### హామీలను అమలు చేసి చూపించాలి

**షాద్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** తెలంగాణ అమర వీరుల గురించి కాంగ్రెస్ నాయకులు గొప్పగా మాట్లాడటం కాదు.. ఉద్యమకారుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలను అమలు చేసి చేతల్లో చూపించాలని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే అమరవీరుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిన ఘనత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థులు, యువత, ప్రజలు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు.ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడిన వారు, ఉద్యమకారుల ఆకాంక్షలను ప్రశ్నించిన వారు నేడు అమరవీరులు, ఉద్యమకారుల గురించి గొప్పగా మాట్లాడటాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సభల్లో కొత్త హామీలు ఇవ్వడం కాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### లోక కళ్యాణం కోసమే సామూహిక సత్యనారాయణ వ్రతం

**తలకొండపల్లి, జులై 20, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలోని గట్టు ఇప్పలపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న బండలగడ్డ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఆయన సతీమణి మాధవి నారాయణరెడ్డి దంపతులు మంగళవారం పూజారులు రాజా పంతులు, శరత్ చంద్రశర్మ, శ్రీనివాసామూర్తి శర్మలు యజ్ఞ మహోత్సవం, సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమాలను వందలాది మంది కార్యకర్తలతో కలిసి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2023 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కసిరెడ్డి నారాయణరెడ్డి విజయం సాధించాలని తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ మేక.శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు రేణు రెడ్డి, మరి కొంతమంది నాయకులు గ్రామ శివారు ప్రాంతంలో అత్యంత మహిమగల బండలగడ్డ ఆంజనేయస్వామిని ప్రార్థించారు. తమ నాయకుడు కసిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం, యజ్ఞ మహోత్సవం నిర్వహిస్తామని వారు మొక్కుకున్నారు. ఎమ్మెల్యే విజయం సాధించడంతో, ఆ మొక్కును నెరవేర్చుతూ మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ, "లోక కళ్యాణం, ప్రజల సుఖశాంతులు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఇటువంటి దైవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. మన ప్రాంతంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీతా నరసింహ, ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు. శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కేశవరెడ్డి, బ్లాక్ స్థాయి మహిళా అధ్యక్షురాలు రమాదేవి,డిసిసి ప్రధాన కార్యదర్శి రఘురాములు, స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, ఆయా గ్రామాల సర్పంచులు రామ లక్ష్మణ్, భారతమ్మ గోపాల్,రమేష్, రాజు నాయక్, నాయకులుశ్రీనివాస్ రెడ్డి, డేవిడ్, రాజేంద్ర నాయక్, రమేష్ యాదవ్, రేణు రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### సర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**కుల్కచర్ల, జులై 21 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియ వేగంవంత చేయాలని మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనేయులు, సర్పంచ్ చంద్రభూపాల్ రావుతో కలిసి జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ అదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఓటరు ఫామ్ నింపి పంచాయతీ కార్యదర్శికి అప్పజెప్పలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోళ్ల భవాని భీమయ్య,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియ లో పాల్గొన్నాలని వార్డు సభ్యులు వెంకటేష్ అన్నారు. కుల్కచర్ల గ్రామ పంచాయతీలో జరుగుతున్న సర్ ప్రక్రియను పరిశీలించారు. దూరం ప్రాంతలలో ఉన్న వ్యక్తులు కచ్చితంగా సమయం ఏర్పాటు చేసుకోని ఫామ్ నింపాలని పేర్కొన్నారు.

### హెచ్‌పివి వాక్సిన్‌పై అపోహాలు వద్దు

**కుల్కచర్ల, జులై 21 ప్రభాతవార్త:** హెచ్‌పివి వాక్సిన్‌పై వస్తున్న తప్పుడు ప్రచారాలు, అపోహాలను నమ్మవద్దని డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమీక ఆరోగ్య కేంద్రంలోని కెజిబివి, మరియు కెవియం పాఠశాలల 176మంది విద్యార్థులకు ఎచ్‌పివి వాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ ఈ టికా మహిళల్లో సర్వైకల్, మరియు పురుషుల్లో జననేంద్రియ మోటిమలు ఇతర క్యాన్సర్లును మమర్థవంతగా అడ్డుకుంటుందని, వాక్సిన్ వల్ల భవిష్యత్తులో పిల్లలు పుట్టరనే ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

**దౌల్తాబాద్, జులై 21,ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారంరోజు బాలంపేట్ గ్రామంలో రైతులకు, గ్రామస్తులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా అధికారులు మాట్లాడుతూ..ఎల్‌నినో కారణంగా రాబోయే రోజుల్లో వర్షపాతంలో లోపం ఏర్పడే ప్రమాదం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి వనరుల లభ్యతపై అవగాహన ఉండాలన్నారు.

## హెచ్‌బిఎల్ బస్టాప్ వద్ద బస్సులు ఆపండి

**శామీర్‌పేట, జులై 21, ప్రభాతవార్త :** అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని హెచ్‌బిఎల్ ఆర్టీసి రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసి బస్సులు ఆపటం లేదని, దీంతో కార్మికులు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసి బస్సులు ఆపటానికి తగు చర్యలు తీసుకో వాలని హకీంపేట్ డిపో ఆర్టీసి మేనేజర్ సరితాదేవిని అలియాబాద్ మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ వినతిపత్రం అందజేసి కోరారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని హెచ్‌బిఎల్ ఆర్టీసి రిక్వెస్ట్ బస్‌స్టాప్ వద్ద బస్సులు ఆపటం లేదని దీంతో కార్మికులు, ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను పరిష్కరించాలని డిపో మేనేజర్ సరితాదేవిని డిపోలో కలిసి వినతిపత్రంను అందజేసి కోరారు. వివిధ కంపెనీలకు వెళ్లె వారికి, ప్రయాణీకులకు కూడ బస్సులు ఆపకపోవటం వల్ల నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన డిఎంకు వివరించారు. దీనికి డిపో మేనేజర్ సరితాదేవి సానుకూలంగా స్పందించినట్లు ఇక నుంచి బస్సుల ఆపే విధంగా చూస్తానని, కార్మికులకు, ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండ హెచ్‌బిఎల్ స్టాఫ్ వద్ద బస్సులు ఆపేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ గాదె వెంకటేశ తెలిపారు.

## దౌల్తాబాద్‌లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

**దౌల్తాబాద్, జులై 21,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో దౌల్తాబాద్ మండలంలో పోలీసులు బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. మంగళవారం ఉదయం స్థానిక పోలీసులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన పులువురు నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సంధర్భంగా అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ...రైతులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని తాము డిమాండ్ చేస్తుంటే,ప్రభుత్వం ఇలా అక్రమ అరెస్టులకు పాల్పడటం సమంజసం కాదని మండిపడ్డారు. ఇప్పటికైనా కక్షసాధింపు చర్యలు మాని,ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ ముందస్తు అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి సంతోష్ కుమార్,పార్టీ నాయకులు రొయ్యల బాల్‌రాజ్,సంగేపల్లి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా పాదయాత్రలు

**జవహర్‌నగర్, జులై 21, ప్రభాతవార్త:** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం సాగుతున్న ఉద్యమం రోజురోజుకు ఉధృత మవుతోంది. డంపింగ్ యార్డు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్రలు మంగళవారం 11వ రోజుకు చేరుకున్నాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్‌లో సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జ్యోతి కాలనీ, సిపిఐ కాలనీ, బజరంగ్ కాలనీలలో మహా పాదయాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ఎస్. బోస్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 25 ఏళ్లుగా జవహర్‌నగర్ ప్రజలు డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం ఎదురుచూస్తున్నారని, ఎన్నో వినతులు సమర్పించినా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని అన్నారు.డంపింగ్ యార్డు వల్ల తాగునీరు, గాలి కాలుష్యానికి గురవుతూ ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని, ఇది పెద్ద పర్యావరణ విపత్తుగా మారిందని పేర్కొన్నారు. తాత్కాలిక చర్యలతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డంపింగ్ యార్డు పోరాట కమిటీ సలహాదారు ఆర్. నరసింహ గౌడ్, చైర్మన్ షేక్ షావలి, కోకన్వీనర్లు తోటపల్లి శంకర్, శివబాబు, బండకింది సింగరయ్య గౌడ్, నిమ్మల నరసింహులు, కసర్ల నాగరాజు, నాగేష్, అంబాల ఎల్లయ్య, షేక్ అజీత్, పెరిక సునీత, ఫాతిమా, వి. స్వరూప, రవి నాయక్, వెంకటరమణ, భాస్కర్‌రావు, వెంకట్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరికలు

**వికారాబాద్,ప్రభాతవార్త :** టీజీఎస్ ఆర్టీసీ వికారాబాద్ డిపోలో టీజె ఎంయూ నుండి 114 మంది, టీఎంయూ నుండి 15 మంది ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సమక్షంలో మంగళవారం చేరారు. టీజేఎంయూ నాయకులు కె. గోపాల్, జీవీకె, రెడ్డి బి.సుదర్శన్, అశోక్, సమీదాస్ రవికుమార్, సురేష్, బందయ్య, అర్చన, సుజాత, నవనీత తదితరులు ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరడం జరిగింది. టీఎంయూ నుండి శ్రీశైలం, నర్సిములు శ్రీనివాస్ శాంతకుమార్ రాజు తదితరులు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అనంతయ్య, నర్సిములు చారి, ఆనందం, యాదగిరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా బల్కంపేట్ ఎల్లమ్మ జాతర

**సంజీవరెడ్డి నగర్, జులై 21, ప్రభాతవార్త:** బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహో త్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళ వారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్ర భుత్వం తరపున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిలకించారు. తదుపరి అ మ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వ హించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతి థులుగా సీఎం కుటుంబ సభ్యులు, రాష్ట్ర మం త్రులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, కొండా సురేఖ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులు, కేంద్రమం త్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి, శాసనస భ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నవీన్ యాదవ్‌ల రాకతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అమ్మ వారి కళ్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు, పుర ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణం గా మెరుగైన వసతులు కల్పించడం జరిగింది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబా, కళ్యాణ మహో త్సవ నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. త్రాగునీరు విద్యుత్ నిరంతరంగా ఏర్పాటు చేపట్టారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అమ్మవారి కళ్యాణం తికలించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం తదుపరి కూడా అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. కలెక్టర్ డాక్ట ర్ ప్రియాంక అలా, డిసిపి ట్రాఫిక్ కాజల్ సింగ్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో వినోద్ రెడ్డి, విద్యుత్ జీహెచ్ఎంసి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు

**ఘట్‌కేసర్, జులై 21, ప్రభాతవార్త:** సాంకేతికతను వినియోగించుకొని ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను సీఐ బాలస్వామి ప్రారంభించారు. ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన సీసీ టివి కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మాజీ వార్డుసభ్యులు సోమసాని రమేష్, సోమసాని వెంకటేష్, తలతోటి వరమ్మలను సీఐ ప్రత్యేకంగా అభినందించి, వారి సేవా భావాన్ని కొనియాడారు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాలనీలో ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఈసందర్భంగా సీఐ బాలస్వామి తెలిపారు. "సాంకేతికతను వినియోగించుకొని ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రతి కాలనీ, ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా దొంగతనాలు, చోరీలు, అసాంఘిక కార్యకలాపాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పోలీసులకు ప్రజలు సహకరిస్తే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని పేర్కొన్నారు. నేరాల నివారణ, నేరస్థుల గుర్తింపు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రాణ మరియు ఆస్తుల రక్షణలో సీసీ కెమెరాలు సమర్థవంతంగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ప్రతి కాలనీ, గ్రామం, అపార్ట్‌మెంట్, వాణిజ్య సముదాయం, విద్యాసంస్థలు మరియు ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు శాఖకు సహకరించాలని



ఇడబ్ల్యుఎస్‌కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, కాలనీవాసులు

కోరారు. ఎస్ఐ బి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలు 24 గంటల నిఘా వ్యవస్థకు దోహదపడతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఇలాంటి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే ప్రతి ఒక్కరూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ప్రజల భద్రతలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని, ప్రతి కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కరుణాకర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## పార్టీకి కష్టపడి సేవలందిస్తేనే గుర్తింపు

**ఘట్‌కేసర్, జులై 21, ప్రభాతవార్త:** పార్టీ సిద్ధాంతాల కోసం నిరంతరం పోరాడిన కార్యకర్తకు రాష్ట్ర బాధ్యతలు ఇచ్చారని బిజెపి రాష్ట్రకార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా, పిఎంఈజిపి సెల్ కోకన్వీనర్‌గా నియమితులైన అంకుశాపూర్ మాజీ ఎంపిటిసి కప్పరగళ్ల కరుణాకర్‌ను మంగళవారం ఆయన సన్మానించారు. బిజెపి ఎస్సీ మోర్చాలో పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తూ, పార్టీ సిద్ధాంతాల కోసం ఎన్నో పోరాటాలు సాగించి, తప్పుడు కేసులు, ఇబ్బందులను సైతం ఎదుర్కొంటూ వెనుకడుగు వేయకుండా పనిచేసిన సేవలకు గుర్తింపుగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా పిఎంఈజిపి సెల్ కోకన్వీనర్‌గా నియమితులయ్యారని తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు-మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలువగా కరుణాకర్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి గారు మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా సాధారణ కార్యకర్తగా పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తూ, ఎన్నో ఒడిదుడుకులు, తప్పుడు కేసులు, ఇబ్బందులను ఎదుర్కొన్నా ఎప్పుడూ వెనుకడుగు వేయకుండా పార్టీ సిద్ధాంతాలకే కట్టుబడి పనిచేసిన వ్యక్తికి రాష్ట్ర స్థాయి గుర్తింపు రావడం ఎంతో ఆనందంగా ఉందని, నా స్నేహితుడు ఈ స్థాయికి ఎదగడం గర్వకారణమని భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని నమ్ముతున్నాను" అని అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ చలవాది ప్రవీణ్ రావు, మాజీ ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం, సీనియర్ నాయకులు సత్యనారాయణ, కుమారస్వామి, చిరంజీవి, వెంకటేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ భరత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**పరిగి టౌన్, జులై 21 ప్రభాతవార్త :** చన్‌గోముల్ పోలీస్ స్టేషన్ ఎస్సై భరత్ రెడ్డిపై దళితులు, గిరిజనులు, మైనార్టీలు, రైతులు వరుసగా చేస్తున్న ఆరోపణలపై సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మౌనం పాటిస్తుండగా, కొంత మీడియా ద్వారా ఎస్సైని సమర్థించే కథనాలు రావడం అనుమానాలకు తావిస్తోందని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. పరిగి పట్టణంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం .వెంకటయ్య, ఉపాధ్యక్షులు ఎహ్. సత్యయ్య, అవాజ్ సంఘం జిల్లా నాయకులు హబీబ్ మాట్లాడుతూ...ప్రజల ముందున్న అసలు ప్రశ్నలు ఏమిటంటే, దళిత రైతు జైదుపల్లి నర్సిములు భూమి ఆక్రమణపై చేసిన ఫిర్యాదుకు న్యాయం జరిగిందా? గిరిజన రైతు అంగోతు గణేష్ చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకున్నారా? అయూబ్ ఖాన్, రాజు తదితరులు చేసిన ఆరోపణలపై స్వతంత్ర విచారణ జరిగిందా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రచార కథనాలతో వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. బాధితుల వాదనలు వినకుండా వారిపైనే కేసులు నమోదు చేయడం పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. నిజంగా ఎస్సై భరత్ రెడ్డి తప్పు చేయకపోతే వెంటనే స్వతంత్ర విచారణకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని, విచారణ పూర్తయ్యే వరకు ఆయనను విధుల నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబ్, బాలరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం

**జవహర్‌నగర్, జులై 21, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ చంద్రపురి కాలనీ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమావేశానికి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ విక్రమ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్యపై ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగని ప్రాంతానికి డంపింగ్ యార్డును తరలించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.అలాగే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొనాలని, స్థానిక ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.జవహర్‌నగర్ ప్రాంతంలో పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిందని, భవిష్యత్తులో కూడా ప్రజల హక్కుల కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో రవీందర్ గౌడ్, మహేందర్ యాదవ్, రాము నాయక్, కుర్ర పుణ్యరాజు, వేపుల సన్నీ, బొమ్మ యాదగిరి, పానుగంటి బాబు, సంతోష్ గుప్తా, రాంబాబు, సుజాత, చంద్రమౌళి, ఓం ప్రకాష్, రెడ్డిశెట్టి మాధవి, లక్ష్మి ్మ రెడ్డి, మహేష్ గౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సందీప్ ముదిరాజ్, నవీన్ కుర్మా, మహేందర్ ముదిరాజ్, రాజశేఖర్ నేత, రాజు నాయక్, వంశీ, అనిల్, బాలాజీ, సుబ్బారావు, రాజేశ్వర్ పటేల్, దయాశంకర్ సింగ్, ధర్మేందర్, కిషోర్ నేత, మల్లికార్జున్ గౌడ్, రఘురాం చారి, సాయి షా, క్రాంతి తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

## అత్యవసర పరిస్థితిలో 'సిపిఆర్' సరైన విధానం

**శామీర్‌పేట, జులై 21, ప్రభాతవార్త:** అత్యవసర పరిస్థితిల్లో ప్రజల ప్రాణాలను ఎలా కాపాడాలని సిపిఆర్ (సిపిఆర్) చేసే సరైన విధానం, భేసిక్ లైఫ్ సపోర్టు (బిఎల్ఎస్) పద్ధతులు, చెస్ట్ కంప్రెషన్స్ ఎఐడి వినియోగం వంటి అంశాలను వైద్య నిపుణులు ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ విద్యార్థినిలకు ప్రాక్టికల్స్ శిక్షణను అందించారు. మంగళవారం శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (జగద్గిరిగుట్ట)లో జాతీయ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్ఎస్), కార్డియో పల్మనరీ రీసస్సిటేషన్ (సిపిఆర్)లపై విద్యార్థినిలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఎల్ఎస్, సిపిఆర్‌ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విద్యార్థినిల కోసం ప్రత్యేకంగా హ్యాండ్స్-ఆన్ ట్రెనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ (ఐఎపి)-ట్విన్ సిటీస్ బ్రాంచ్, యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ వారు సంయుక్తంగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గీత మాట్లాడుతూ విద్యతో పాటు జీవన నైపుణ్యాలు కూడ ప్రతి విద్యార్థికి అవసరమన్నారు. వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ వి.స్రవంతి మాట్లాడుతూ ప్రాణరక్షణలో సమయస్ఫూర్తి ఎంత ముఖ్యమో విద్యార్థినిలకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగ విద్యార్థినిలకు ఇలాంటి ప్రాయోగిక శిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఉపయోగకరమన్నారు. ప్రతి ఎన్ఎస్ఎస్ వలంటీర్ ప్రాణరక్షకుడిగా తీర్చి దిద్దటమే ఈ శిక్షణా కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వైద్య నిపుణులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఓటు బ్యాంకు తొలగించే కుట్రను అడ్డుకుందాం

**మేడ్చల్, జులై 21, ప్రభాతవార్త :** ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కఠిన తరం చేసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లను తొలగించే కుట్రను చేస్తున్నదని కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల సమీక్ష సమావేశాన్ని గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం మంచిదేనని కాని దానికి బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్ని కఠినతరం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఓట్లు బ్యాంకు కాంగ్రెస్‌కు ఉందని, ఆ ఓటు బ్యాంకును దెబ్బదీసేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ముందుకు సాగాలని తెలిపారు. ఇంచార్జ్‌ల సమన్వయంతో పాటు పడి ప్రతి ఓటరు నమోదు చేసుకునే విదంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్ల పోచంపల్లి డివిజన్‌ల పార్టీ అధ్యక్షులు చాపరాజు, మల్లేష్ గౌడ్, సురేందర్ ముదిరాజ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు విగ్నేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు చీర్ల రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, కౌద మహేష్, రమణారెడ్డి, మహేష్ గౌడ్, ముత్యాలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## 26 నుంచి తాండూరులో ఉర్సు ఉత్సవాలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలో చారిత్రాత్మక ఉర్సు ఉత్సవాలు ఈనెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. హజ్రత్ సయ్యద్ అబ్దుల్ కరీమ్ చిష్తి ఖలందరి మిర్జాయి 80వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలతో పాటు హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలామ్‌పాష ఉర్సే షరీఫ్ 20వ ఉత్సవాలు కూడా నిర్వహిస్తున్నట్లు అల్హాజ్ సయ్యద్ అబ్దుల్ ఘనీపాష వెల్లడించారు. 26న ప్రారంభమయ్యే ఉత్సవాలలో భాగంగా 27న గంధాలు, 28న దీపోత్సం, ఖవ్వాలి, 29న ఫాతెహా, ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుంచి హిందూ, ముస్లీం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారని గుర్తు చేశారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## ఇద్దరు పిల్లలతో గృహిణి అదృశ్యం

**జవహర్‌నగర్, జులై 21, ప్రభాతవార్త :** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేజే నగర్, యాప్రాల్ ప్రాంతానికి చెందిన శ్రావణి (28) తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రావణి తన భర్త సుమంత్‌తో కలిసి యాప్రాల్‌లో నివాసం ఉంటోంది.ఈ నెల 16వ తేదీన భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ అనంతరం సుమంత్ తన స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అనంతరం ఈ నెల 19వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో శ్రావణి చెల్లెలు అనూష ఇంటికి వెళ్లి చూడగా, శ్రావణితో పాటు ఆమె ఇద్దరు కుమారులు అవినాష్, యశ్వంత్ ఇంట్లో కనిపించలేదు. విషయం తెలుసుకున్న అనూష తన అక్క, పిల్లల కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో, తెలిసిన వారి వద్ద వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో ఆమె జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నగరంలో రౌడీ షీటర్ దారుణ హత్య

**సరూర్‌నగర్, జులై 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. తన సోదరి, సోదరుని హత్యలకు ప్రతీకారంగా ఓ యువకుడు రౌడీషీటర్‌పై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి చంపాడు. పుట్టిన రోజు వేడుకకు హాజరైన రౌడీషీటర్ కళ్ళల్లోకి పేపర్ స్ప్రే చల్లిన తర్వాత పారి పోతుండగా వెంబడించి నడి రోడ్డుపైనే అంతమొందించి కక్ష తీర్చుకున్నాడు. హతమైన రౌడీషీటర్‌పై దాదాపు 18 పోలీస్ స్టేషన్లలో సుమారు 40కి పైగా కేసులు ఉన్నట్లు సమాచారం. అంతే కాకుండా అతడిని పోలీసు కమీషనర్ గతంలో నగర బహిష్కరణ కూడా చేసినట్లు తెలిసింది. కాగా రౌడీషీటర్‌ను హత్య చేసిన నిందితుడు పారిపోయి ఏకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో లైవ్‌లో స్నేహితు నితో మాట్లాడుతూ తానే హత్య చేసినట్లు ప్రకటించడం వైరల్ అయ్యింది. తీవ్ర కలకలం రేపిన ఈ హత్యోదంతం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది.

## జవహర్ నగర్‌లో కార్పెంటర్ అదృశ్యం

**జవహర్ నగర్, జులై 21, ప్రభాతవార్త:** కార్పెంటర్ అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ లో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం సాయి కుమార్ (25) గత కొద్ది కాలంగా బాలాజీ నగర్ లో తల్లిదండ్రులతో కలిసి నివాసముంటున్నాడు. గత కొద్ది కాలంగా సాయికుమార్ కార్పెంటర్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం నాలుగున్నర గంటలకు కార్పెంటర్ పని ఉందని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లి ఆ తర్వాత తన సోదరికి ఫోన్ చేసి బంధువులు మందలించడంతో మనసు చెలించిపోయి చనిపోతున్నా అని చెప్పి తన ఫోను స్విచ్ ఆఫ్ చేశాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు అతని గురించి చుట్టుపక్కల వెతికిన తెలిసిన వారి వద్ద వెతికిన అతని సమాచారం లభించలేదు. ఈ మేరకు సాయికుమార్ తండ్రి సోమనారాయణ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పరమేశ్వరికి బంగారు పతకం

**పరిగి టౌన్ జులై 21 ప్రభాతవార్త :** పరిగి మున్సిపల్‌లో పతంజలి యోగ శిక్షకురాలు పరమేశ్వరి డిస్టిక్ లెవెల్ లో బంగారు పతకం సాధించారు. సోమవారం హైదరాబాదులో యోగాసనా భారత్ వారు నిర్వహించినటువంటి



రంగారెడ్డి జిల్లా డిస్టిక్ లెవెల్ యోగాసనం ఛాంపియన్‌షిప్‌లో భాగంగా పతాంజలి పరిగి యోగశిక్షకురాలు పరమేశ్వరి ప్రథమ బహుమతి బంగారు పతకం రావడం జరిగింది.ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగను అలవర్చుకోవాలి అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు.

## పట్టణ సమస్యలు పట్టించుకోండి

**వికారాబాద్,ప్రభాతవార్త :** పట్టణ సమస్యలను మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు గాలికొదిలేశారని బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు ఆరోపించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని రాయిచాందిని కాలనీలో పర్యటించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాయిచాందిని కాలనీలో గత ఆరు నెలలుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పలుమార్లు మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేరని విమర్శించారు. డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించి కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదే నిరక్ష ్య వైఖరి కొనసాగితే కాలనీ వాసులతో కలిసి పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైతే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.



సీత్లా పండుగలో పాల్గొన్న డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, గోర్ అసోసియేషన్ సభ్యులు

## ఉత్సాహంగా బంజారాల సీత్లా పండుగ

**ఘట్‌కేసర్, జులై 21, ప్రభాతవార్త:** ప్రకృతిని ఆరాధించే పండుగలను సాంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్ బ్యూటీనెస్ట్ కాలనీలో గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాల సీత్లా పండుగను నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి సీత్లా మాత ప్రతిమకు ప్రత్యేక పూజలు చేయగా నిర్వహకులు శాలువాతో సన్మానించారు. లంబాడి మహిళలు తమ సంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలు ఎత్తుకుని, డప్పుల చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారికి నైవేద్యంగా గుగ్గిళ్లు, పాయసం (లాప్సి) సమర్పించారు. ఈసందర్భంగా గోర్ అసోసియేషన్ నాయకులతో కలిసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు ప్రకృతిని, వర్షాలను, పశుసంపదను ఆరాధిస్తూ ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఒక ప్రధానమైన సాంప్రదాయ పండుగ సిత్లా అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తమ పశువులు (గొర్రెలు, మేకలు, పశువులు) ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని, తండాకు ఎలాంటి అరిష్టాలు రాకుండా సీత్లా భవాని (తల్లి) కాపాడాలని మొక్కుకుంటారని తెలిపారు. వర్షాకాలం ప్రారంభంలో, ముఖ్యంగా ఆషాఢ మాసంలో పెద్ద పుష్యాల కార్తెలో ఈ పండుగను జరపడం ఆనవాయితీ వస్తుందని, తండాలోని పొలిమేరలో లేదా కూడలిలో ఉండే సీత్లా మాత ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారని, పురుషులు డప్పు వాయిద్యాలతో, జంతు బలులతో (కోళ్లు, మేకలు) పూజలు నిర్వహిస్తార ని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ మెదబోయిన వెంకటేష్, గోర్ అసోసియేషన్ అధ్యక్షులు మోతీలాల్, ఉపాధ్యక్షులు రూపావత్ నరేష్, సంయుక్త కార్యదర్శి డి.జి నాయక్, మాజీ అధ్యక్షులు రాములు నాయక్, కార్యవర్గసభ్యులు పి.తిరుపతి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి

## భూ కబ్జా భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం

**మోమిన్‌పేట్,జులై 21. ప్రభాతవార్త:** కబ్జాలో ఉన్న భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మోమిన్‌పేట్ మండల రెవెన్యూ అధికారి మునీరొద్దీనన తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని టేకులపల్లి గ్రామాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. గత 50, సంవత్సరాల నుండి సర్వే నెంబర్ 437, 438, 440, నెంబర్లలో సుమారు 50, మంది కబ్జాలో ఉన్నారు. గత 50, సంవత్సరాల క్రితం పట్టాదారు వద్ద కొనుగోలు చేశారు. అయినప్పటికి అప్పటి నుండి ఇప్పటి వరకు సట్టాదారుల సేర్లమీదనే ఆన్‌లైన్లో ఉండటం వల్ల, వారి వారపులు కబ్జాలో ఉన్న వారిని బెదిరించి డబ్బులు కావాలని మమ్మల్ని డిమాండ్ చేస్తున్నారని భాధితులు తహశీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు తహశీల్దారు కబ్జాలో ఉన్న భాదితులు వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడం వల్ల పట్టాదారులకు రైతుబంధు, మరేఇతర ప్రభుత్వం నుండి అంజేయడం జరుగదని, కాబట్టి భాదితులకు అట్టి భూమిపైన ఎలాంటి హక్కు ఉంటుందని, అందుకోసం భాధ్యులకు న్యాయం చేసేందుకు రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ద్వారా పంచనామా నిర్వహించి , సర్వే చేయించి భాదితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రైతులకు ఆయన భరోసా ఉచ్చారు. ప్రభుత్వం నుండి అర్హులైన పేద ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పంచాయతి కార్యదర్శిని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణంలో మీకు ఎవరైనా పిర్యాదు చేస్తే తమ దృష్టికి తీపుకరావాలని ఆయన అన్నారు. గ్రామంలో సమస్యలు తలెత్తకుండా గ్రామస్తుల సమక్షంలో శాంతియుతంగా, సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మన్మోహన్ గౌడ్, మాజీ ఎంపీటీసి సభ్యులు భాస్కర్, గ్రామ పరిపాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌చారి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కుమార్, నరేందర్ గౌడ్, ఫయాజ్, రహమత్ అలీ, మాణిక్యం, కబ్జాలో ఉన్న భాదిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నిర్వహణ

**మెహిదీపట్నం, జులై 21, ప్రభాతవార్త :** నగరంలో అత్యంత వైభవంగా ప్రారంభమైన గో ల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి బోనాల ఉత్సవాలను మునుపెన్నడూ లేని విధంగా డ్రోన్‌ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు సిటీ ట్రాఫిక్ పోలీసులు. బోనాల ఉత్సవాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో గోల్కొండ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల వెంట ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 16న ప్రారంభమైన బోనాల ఉ త్సవాలకు సంబంధించిన ట్రాఫిక్ మళ్లింపులతో పాటు డ్రోన్ ల సహాయంతో తీసిన వాహనాల రాకపోకల ఫోటోలను విడుదల చేశారు ట్రాఫిక్ పోలీసులు. గోల్కొండ జోన్ ట్రాఫిక్ ఏసిపి డి ధనలక్ష్మీ ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సుగ మం చేయడానికి నగర ట్రాఫిక్ పోలీస్ శాఖ మొదటిసారిగా డ్రోన్ సర్వేలెన్స్ (డ్రోన్ల నిఘా) వ్య వస్థను అందుబాటులోకి తేవడం జరిగిదన్నారు. డ్రోన్ ల సహాయంతో పార్కింగ్ స్థలాలు, ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను ఎప్పటికప్పుడు ఆకాశ మార్గం ద్వారా పర్యవేక్షిస్తూ, ట్రాఫిక్ జామ్ లను తక్షణమే నివారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. ముందస్తుగా ప్రకటించిన రూట్ డైవర్షన్ల ప్రకారం వాహనాలు సజావుగా సాగేలా అన్ని ప్రధాన మళ్లింపు పాయిం ట్లను డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించడంతో పాటు గోల్కొండ కోటకు సమీ పంలో కేటాయించిన పార్కింగ్ స్థలాలలో వాహ నాల రద్దీని అంచనా వేయడానికి, అనధికార పా ర్కింగ్‌ను నిరోధించడానికి మరియు భక్తులకు ఖాళీ గా ఉన్న పార్కింగ్ స్థలాలను సూచించడానికి డ్రోన్ లను ఉపయోగిస్తున్నామన్నారు. కోటకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాలు మరి యు భక్తులు పెద్ద సంఖ్యలో సమకూరే ప్రాంతాలలో ట్రాఫిక్ ఆటంకాలను తక్షణమే గుర్తిస్తారు.

## లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ నార్త్ నూతన అధ్యక్షుడిగా రవి కుమార్ అనుముల శెట్టి

**జీడిమెట్ల, జులై 21, ప్రభాతవార్త**

లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ 15వ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం జీడిమెట్లలోని జేఏఈ హాల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షుడిగా రవి కుమార్ అనుముల శెట్టి పదవీ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా 320బి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అవంతి రెడ్డి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమానికి జీఏటీ ఏరియా లీడర్ ఆవుల గోపాలరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లా 320బిలో సికింద్రాబాద్ నార్త్ లయన్స్ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మల్లారెడ్డి ఆస్పత్రి వద్ద ప్రతిరోజూ నిరంతరాయంగా అల్పాహారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో క్లబ్ సభ్యులందరూ చురుకుగా పాల్గొనడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా మహంకాళి రావు కార్యదర్శిగా, కర్ణ శ్రీనివాస్ కోశాధికారిగా, మరో 30 మంది బోర్డు ఆఫ్ డైరెక్టర్లు తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా 320బి సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బిరు ఆంజనేయులు, లయన్స్ క్లబ్ ప్రముఖులు రాజేంద్ర ప్రసాద్, దీపక్ భట్టాచార్య, విజయ్ కుమార్ శెట్టి, ప్రత్యేక అతిథిగా తాజా మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ మామిడాల శ్రీనివాస్ ,పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి: మంద కృష్ణ మాదిగ



బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

**సంజీవరెడ్డి నగర్, జులై 21, ప్రభాతవార్త:**

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బల్కంపేట ఎల్లమ్మ ఎంతో చల్లని తల్లిగా భక్తుల కోరికలు తీర్చే దైవమని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, పశుపక్ష్యాదులు, సమస్త జీవకోటి అమ్మవారి కరుణా కటాక్షాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా అమ్మవారి ఆశీర్వాదాలు అందరిపై మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వి. నరసింహ, దప్పు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి



ఢిల్లీలో మహిళా రిజర్వేషన్ కోసం ఆందోళన చేస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త**

మహిళ రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహిళా కాంగ్రెస్ నేతలు ఛలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టింది. ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో ఆలిండియా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబ ఆధ్వర్యంలో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు నగరం నుండి భారీ ఎత్తున మహిళా కాంగ్రెస్ సభ్యులు ఢిల్లీ తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇంచార్జ్, నేషనల్ జనరల్ సెక్రెటరీ కమలాక్షి రాజన్నతో కలిసి నిరసన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ సాధన కోసం జంతర్ మంతర్ వద్ద జరగాల్సిన నిరసనకు పర్మిషన్ ఇవ్వకుండా అడ్డుకోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మహిళలంటే అంత భయమా అంటూ నిలదీశారు. మోడీ ఎప్పుడైతే భయపడతారో అప్పుడు పోలీసు సిబ్బందిని ముందు ఉంచుతారని విమర్శించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజీవ్‌గాంధీ ఆనాడే పంచాయతీరాజ్ వ్యవస్థలో 33 రిజర్వేషన్ మహిళలకు ఇవ్వడం జరిగిందని గుర్తుచేశారు. నేడు మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు,డీ లిమిటేషన్‌కు అడ్డుపెట్టి మహిళలకు అన్యాయం చేస్తున్నాడని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని,అందులో ఓబీసీ మహిళలను కూడా చేర్చాలని డిమాండ్ చేశారు.

## ప్రకాష్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్‌కు సన్మానం



దర్గ కరుణాకర్‌ను సన్మానిస్తున్న నసీరుద్దీన్ తదితరులు.

**బేగంపేట జులై 21,ప్రభాతవార్త**

ప్రకాశ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియమితులైన దర్గ కరుణాకర్ ను బేగంపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నసీరుద్దీన్ తదితరులు మంగళవారం బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా శాలువాలు,పూల దండలతో సన్మానించారు. చేతికి దట్టీ కట్టి అభినందించారు. ఈ సందర్భంగా వారిరువురూ రానున్న కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా. కోట నీలిమ, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ల ఆధ్వర్యంలో బేగంపేట,ప్రకాశ్ నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ ను సన్మానించిన వారిలో శ్రీఉజ్జయినీ మహాకాళీ ట్రస్ట్ బోర్డు మెంబర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెక్కల రాజేందర్ ముదిరాజ్,సిద్దిక్, మునీర్, జమీర్, సురేష్‌బాబు, నవీన్, మహిళా అధ్యక్షురాలు రాధ, చంద్రకళ, ధనలక్ష్మి, సలీం, ఇలియాస్, ఉన్నారు.

## 29న గురు పౌర్ణమి మహోత్సవాలు

**చాంద్రాయణగుట్ట, జులై 21, ప్రభాతవార్త :** లాల్‌దర్వాజ వెంకట్రావు స్కూల్ సమీపంలోని శ్రీ దత్తాత్రేయస్వామి మందిరంలో ఈనెల 29వ తేదీ బుధవారం గురు పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ ఆలయ ప్రధాన అర్చకులు పి. దత్తప్రసాద్ తెలిపారు. ఉదయం 5గంటలకు శ్రీ షిర్డీ సాయిబాబాకు అభిషేకం, ఉదయం 7గంటలకు శ్రీ దత్తాత్రేయ స్వామికి అభిషేకం, అలంకరణ, హారతి కార్యక్రమాలుంటాయని వివరించారు. సాయంత్రం 6గంటలకు భక్తులకు మహా ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబా, దత్తాత్రేయ స్వామి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

# అంబర్‌పేటలో 480 ఇందిరమ్మ ఇళ్లు

**-రూ.10 వేల డిపాజిట్‌తో ఆగస్టు 10లోగా దరఖాస్తులు**
**-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



సిపిఎల్ ల్యాండ్ మ్యాప్‌తో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త**

అంబర్‌పేట నియోజకవర్గానికి 480 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట్ మండలం, సిపిఎల్‌కు చెందిన 129 ఎకరాల 5 గుంటల భూమిలో గృహాల నిర్మాణం కోసం 10 ఎకరాల భూమిని గుర్తించారని తెలిపారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవం సందర్భంగా తన విజ్ఞప్తి మేరకు సిపిఎల్‌కు చెందిన భూమిలో ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయ సముదాయం, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, ఫైర్ స్టేషన్, విద్యార్థుల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు అంబర్‌పేట నడిబొడ్డున మొదటిసారి ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కొనసాగనుందన్నారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి హామీలు అమలుపరుస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అంబర్‌పేటలో నిర్మించే 480 ఇందిరమ్మ ఇళ్లకు 10ఏళ్లుగా స్థానికంగా ఉంటున్నవారే అర్హులన్నారు. సొంత ఇళ్లు, ఫ్లాట్ లేదా ప్లాటు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదన్నారు. గతంలో ఎలాంటి గృహ ప్రయోజనం పొంది ఉండకూడదన్నారు. నిర్మాణానికి అయ్యే 11లక్షల వ్యయంలో ప్రభుత్వం రూ.5 లక్షల రాయితీ ఇస్తుందని, మరో 6లక్షలు లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. కనీసం పదేళ్ల వరకు క్యూర్ పరిధిలోనే నివసించి ఉండాలని, వార్షిక కుటుంబ ఆదాయం మొత్తం రూ.6 లక్షల లోపు వరకు ఉండాలని,ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గంలోనే ఇళ్లు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేటి నుంచి ఆగస్టు 10 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారని తెలిపారు. మీ సేవ కేంద్రాలు, మీ సేవ వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రూ.100 దరఖాస్తు ఫీజుతో పాటు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని, ఫ్లాట్ రాకపోతే రూ.10 వేలు తిరిగి ఇస్తామని, వస్తే లబ్ధిదారుల 6లక్షల వాటాలో తగ్గిస్తామని వెల్లడించారు. పదంతస్థుల టవర్లలో ఒక్కో అంతస్థుకు 12 ఫ్లాట్ల చొప్పున 528 చదరపు అడుగుల్లో సింగిల్ బెడ్ రూమ్‌లు నిర్మించేలా హౌసింగ్ బోర్డు డిజైన్లను ఖరారు చేసిందని, కార్పెట్ విస్తీర్ణం 400 చదరపు అడుగులు ఉంటుందన్నారు. కేటాయించిన ఎల్ఐజీ ఫ్లాట్లను పదేళ్ల పాటు అమ్మడానికి లేదా అద్దెకు ఇవ్వడానికి వీల్లేదని ప్రభుత్వం షరతు విధించిందన్నారు. పదేళ్ల తర్వాత ఆయా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మహిళలకు 30 శాతం, ఎస్సీలకు 14, ఎస్టీలకు 5శాతం, బీసీలకు 16శాతం, దివ్యాంగులకు 5శాతం, ప్రభుత్వ ఔట్ సోర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు 10 శాతం రిజర్వ్ చేసి, మిగతా 50 శాతం జనరల్‌గా కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దరఖాస్తులు ఎక్కువగా వస్తే లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు.

## ఎల్ఐసీ దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం : మహేష్ కుమార్ గౌడ్



అతిథిగా హాజరైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**చిక్కడపల్లి జులై21, ప్రభాతవార్త :** దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసీ మూలస్తంభమని, సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమం, కార్యకలాపాల నిర్వహణ కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సొంత భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంగళవారం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐఏఎఫ్ఐ) డివిజనల్ కౌన్సిల్ త్రైవార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రైవేట్ బీమా సంస్థలు ఎన్ని వచ్చినా ప్రజల్లో ఎల్ఐసీపై ఉన్న విశ్వాసం ఏమాత్రం తగ్గలేదని అన్నారు. తనకు ఎల్ఐసీతో మూడు దశాబ్దాల అనుబంధం ఉందని, సంస్థ జాతీయ నాయకుడు కౌటికే విటల్ తన కళాశాల సహచరుడని గుర్తుచేసుకున్నారు. కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసచారి మాట్లాడారు. భారతదేశ నంబర్-1 సీఎల్ఐఏ, సంస్థ జాతీయ నాయకుడు కౌటికే విటల్ మాట్లాడుతూ ఎల్ఐసీ ఏజెంట్లకు నిరంతర వృత్తిపరమైన శిక్షణ, నిబంధనలపై సమగ్ర అవగాహన, పూర్తి స్థాయి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డివిజనల్ కౌన్సిల్ సొంత భవన నిర్మాణానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. నూతన అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి జి. గోవింద్ రెడ్డి, కోశాధికారి భాస్కర్‌తో పాటు ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహు, మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాదరావు, అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ (సీఎల్ఐఏ) ప్రభాకర్, అఖిల భారత కోశాధికారి శ్రీరామ్, జాతీయ, జోనల్ నాయకులు ఇంద్రారెడ్డి, కట్టా వెంకటరెడ్డి, రాజేష్, హేమలత, ఆవిరినేని విజయలక్ష్మి, ఆకునూరి రాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వవిద్యార్థులు



సమ్మేళనంలో నార్సింగి ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు.

**నార్సింగి, జులై 21 ప్రభాతవార్త :**

మూడు దశాబ్దాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాత మధుర జ్ఞాపకాల జడివానలో తడిసి ముద్దయ్యారు. అరేయ్ ఒరేయ్ అంటూ నిక్‌నేమ్‌లతో పిలుచుకుంటూ పదో తరగతి విద్యార్థుల్లా మారిపోయారు. గండిపేట మండలం నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్న 150.మంది విద్యార్థులంతా మంగళవారం కలుసుకొని ఆడి,పాడి ఆనందడోలికల్లో మునిగి తేలారు. ఆనాడు తమకు విద్యాబుద్ధులు నేర్పించిన అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ప్రతీ ఏటా ఇలాగే కలుసుకుందామని, ఇబ్బందులు పడుతున్న తోటి స్నేహితులకు ఆర్థిక సహకారం అందిద్దామని ప్రకటించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనాటి విద్యార్థులు త్రివేణి, ఉమాదేవి, ఇందిర, మహికృష్ణ, హరికృష్ణ, రాజు, రమేష్, నాగిరెడ్డి, ప్రవీణ్ కుమార్, సుధాకర్, శ్రీపాల్ పాల్గొన్నారు.

## లీలాద్రి లక్ష్మీనరసింహ ఆలయంలో నాగుపాము దర్శనం



**కెపిహెచ్‌బి కాలనీ, జులై 21, ప్రభాతవార్త:**

కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ సర్కిల్ తులసి నగర్‌లోని స్వయంభూ శ్రీ లీలాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం ఆశ్చర్యకర ఘటన చోటుచేసుకుంది. సుమారు 10 అడుగుల పొడవున్న నాగుపాము ఆలయ గర్భగుడిలో స్వామివారి మూలవిరాట్ సమీపంలో పడగవిప్పి కనిపించింది. ఉదయం ఆలయ తలుపులు తెరవడానికి వెళ్లిన అర్చకులు నాగుపామును చూసి ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. కొద్దిసేపు అక్కడే ఉన్న పాము అనంతరం ఎలాంటి హాని చేయకుండా నెమ్మదిగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనను గమనించిన భక్తులు తమ మొబైల్ ఫోన్లలో వీడియోలు చిత్రీకరించారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పలువురు భక్తులు దీనిని "ఆదిశేషుడు స్వామివారిని సేవించేందుకు వచ్చిన దివ్య దర్శనం"గా భావిస్తుండగా, మరికొందరు ఇది సహజంగా జరిగిన సంఘటన అని అభిప్రాయపడుతున్నారు.



గుడిమల్కాపూర్ డివిజన్ తాళ్లగడ్డ ,అశోక్ విహార్ ,భగవాన్ దాస్ ,తదితర బస్తీలకు సంబంధించిన ఓటర్ బూతులో ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన కల్పిస్తూ సర్ ఫారం నింపడంలో ఓటర్లకు సహకరిస్తున్న అంబటి శ్రీనివాస్

## 29వ భవ్య కావడి యాత్ర బ్రోచర్ ఆవిష్కరణ



సమావేశంలో పాల్గొన్న భాగ్యనగర్ కావడి సేవా సంఘం ప్రతినిధులు

**చార్మినార్, జులై 21 ప్రభాతవార్త :**

భాగ్యనగర్ కావడి సేవా సంఘం ఆధ్వర్యంలో అగష్టు నెల 16వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్న 29వ భవ్య కావడి యాత్రకు సంబంధించిన బ్రోచర్‌ను కావడి యాత్ర ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. చార్మినార్ శ్రీ మహదేవ మందిరం నుంచి ఆగష్టు నెల 16వ తేదీ ఆదివారం 6.31 గంటలకు భవ్య కావడి యాత్రం ప్రారంభమై పలు మార్గాలు మీదుగా కొనసాగిన అనంతరం 17వ తేదీ సోమవారం రోజున సరూర్ నగర్‌లోని శ్రీ ఉమా మహేశ్వరి స్వామి వారి దేవస్థానికి చేరుకుంటుందని, బ్రహ్మ ముహూర్తంలో భగవాన్ శివునికి ప్రయాగ్ నుంచి తెచ్చిన గంగా జలంతో అభిషేకం జరుగుతుందని సంఘం ప్రతినిధులు తెలియజేశారు. సంఘం అధ్యక్షులు మాంగేరామ్ తాయల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు కునాల్ గోయల్, చంపాలాల్ వేద్, పురుషోత్తం అగర్వాల్, కమల్ కిశోర్ మాలాణి, సుశీల్ కుమార్ అగర్వాల్, మీను గుప్తా, ఫంకజ్ వర్మ, ఓం ప్రకాష్ అగర్వాల్, భరత్ కుమార్ అగర్వాల్, భరత్ ఛబరియా పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు మాజీ మంత్రి కెటిఆర్‌కు ఆహ్వానం



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయం కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జులై 21 ప్రభాతవార్త :**

పాతబస్తీ హరిబౌలిలోని చారిత్రాత్మకమైన అక్కన్న మాదన్న శ్రీ మహంకాళీ ఆలయంలో వచ్చే నెల తొమ్మిదివ తేదీన జరగనున్న 78వ వార్షిక బోనాల జాతర ఉత్సవాలలో పాల్గొనాలని కోరుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కలిసి ఆలయం కమిటి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షులు డి.ప్రభాకర్, కార్యదర్శి కె. దత్తాత్రేయ, కోశాధికారి ఎ.సతీష్, కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు ఎం. జగ్మోహన్ కపూర్, ఎం.వినోద్‌కుమార్, సభ్యులు పి.సాయి కిరణ్, రవీందర్ చారి, ఎల్.అరుణ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పెద్దమ్మతల్లి శాకాంబరి ఉత్సవాలు..



పూజలో పాల్గొన్న విష్ణువర్ధన్ రెడ్డి.

**జూబ్లీహిల్స్, జులై 21, ప్రభాతవార్త:**

జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆషాఢ మాస శాకాంబరి ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో సుందరంగా అలంకరించి శాకాంబరి రూపంలో అమ్మవారిని దర్శనమిచ్చేలా తీర్చిదిద్దారు. దాదాపు క్వింటాల్‌కు పైగా కూరగాయలను వినియోగించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 3 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అనంతరం విశేష పూజలు, అర్చనలు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సౌకర్యం, ప్రసాదాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ నెల 22న ఆలయంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. శాకాంబరి అలంకరణను తిలకించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో నిండిపోయాయి.

## కార్మికవర్గం ఐక్యంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం: మాజీ ఎంపీ డాక్టర్ సంజీవరెడ్డి





ప్రసంగిస్తున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవరెడ్డి

**చిక్కడపల్లి జులై 21, ప్రభాతవార్త :** ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక వర్గం తమ సమస్యలను పరిష్కరించుకోగలదని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్. జి. సంజీవరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి విఎస్టి యూనియన్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఐకేపీ వీఓఏ అసోసియేషన్ (ఐఎన్‌టీయూసీ) ప్రథమ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ గౌరవ సలహాదారు వై. నాగన్న గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా డాక్టర్ జి. సంజీవరెడ్డి మాట్లాడుతూ వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు, వారికి నెలకు రూ. 26,000 కనీస వేతనం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వీఓఏల సమస్యలపై సానుకూల దృక్పథంతో ఉందని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డిలను కలిసి వీఓఏల దీర్ఘకాలిక సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కనీస వేతనాల మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ.. వీఓఏల డిమాండ్లు న్యాయమైనవని, వారికి కనీస వేతనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీఓఏల పోరాటానికి ఐఎన్‌టీయూసీ చివరివరకు అండగా ఉంటుందని ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మహాసభలలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు బి. విజయ్ కుమార్ యాదవ్, వి. భాస్కర్ రెడ్డి, మహిళా నేత కొండా పద్మ, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి. ప్రభాకర్, పి. అరుణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్, ఉపాధ్యక్షురాలు కవితతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి దాదాపు 3,000 మంది వీఓఏ ప్రతినిధులు పాల్గొన్నారు. ఐకేపీ వీఓఏల హక్కుల పరిరక్షణకు, వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐఎన్‌టీయూసీ అచంచలమైన నిబద్ధతతో పనిచేస్తుందని హామీ ఇచ్చారు. , రాష్ట్ర కనీస వేతనాల మండలి చైర్మన్ బి. జనక్ ప్రసాద్ మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మహిళల భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యం



నిరసన కార్యక్రమం చేపట్టిన మహిళా సంఘాల నేతలు

**సైఫాబాద్, జులై 21, ప్రభాతవార్త:** పరిపాలనలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని మహిళా రిజర్వేషన్ సంయుక్త కార్యాచరణ కమిటీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు ఆటంకాలను నిరసిస్తూ ఐద్వా, పీఓడబ్ల్యూ, సిఎమ్ఎస్, పీఓడబ్ల్యూ2ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, పిఓడబ్ల్యూ 1 రాష్ట్ర అధ్యక్షులు రాలు స్వరూప, పీఓడబ్ల్యూ2 రాష్ట్ర నాయకులు భారతి హాజరై మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు రిజర్వేషన్లు తక్షణం అమలుచేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో మహిళల ప్రాధాన్యం పెరిగితే మహిళల సమస్యలు సమర్థవంతంగా చర్చకు వస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు ఆశాలత, పి.ప్రభావతి, పి.శశికళ, ఎం.వినోద, వరలక్ష్మి, కే.అనురాధ, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకోసం పరితపించే తల్లిదండ్రుల కథనమే ఆఖరిమజిలీ

**- ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**

**రవీంద్రభారతి, జులై 21 ప్రభాతవార్త :** ప్రఖ్యాత రంగస్థల నిపుణుడు గరిమెళ్ళ రామమూర్తి 90వ జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రముఖ రంగస్థల టీవి నటుడు, దర్శకుడు ముక్తేవి ప్రకాశరావుకు ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో గురువారం రాత్రి 6.30గంటలకు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారావు ముఖ్యఅతిథి హాజరై రంగస్థల పురస్కారం-2026 ప్రదానం చేయనున్నటు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి తెలిపారు. ఆత్మీయ అతిథులుగా సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డా. డి.విజయభాస్కర్, తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తదితరులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలను బాగా చదివించి విదేశాల్లో ఉద్యోగాలు చేసి కోట్లకు పడగలెత్తాలని పరితపించే కథనమే రసరంజని సందేశాత్మక ఆఖరి మజిలీ నాటక ప్రదర్శన ఉంటుందని డా. కె.వి.రమణాచారి అన్నారు. కానీ జీవిత చివరిదశలో వారితో కలిసి జీవితాలు గడపాలన్న ఆశ అడియాస కావడం, ఆత్మీయంగా పిలిచే పలుకుకు నోచుకోలేక ఒంటరి జీవితం గడపలేక వృద్ధాశ్రమాల పాలవుతున్నారు. ఆఖరికి చనిపోయినా తలకొరివి పెట్టడానికి రాని కొడుకులున్న ఈరోజుల్లో జరిగే అనైతిక పరిణామాలు, వాటి పర్యవసానమే శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ ఢిల్లీ వారి సమర్పణలో రావి నాగేశ్వరరావు రచన, ద్వాదశి వెంకట చంద్రశేఖర్ దర్శకత్వంలో రూపొందిన ఆఖరిమజిలీ నాటకమని రమణాచారి పేర్కొంటూ అధికసంఖ్యలో రంగస్థలప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆసాంతం తిలకించి విజయవంతం చేయాలని కోరారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఎల్లమ్మ కళ్యాణంకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, జులై 21, ప్రభాతవార్త:**

కవాడిగూడ సింగాడికుంటలోని ఎల్లమ్మ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కళ్యాణోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్‌కు ప్రభుత్వ గుర్తింపు



నరేష్‌కు గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న జయేష్‌రంజన్

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారుల కోసం సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్ (సీఎస్ఎస్‌హెచ్)ను క్రీడా విజ్ఞాన, క్రీడా వైద్య కేంద్రంగా స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. క్రీడాకారుల ఆరోగ్యం, ప్రదర్శనను మెరుగుపరచడానికి కట్టుబడి ఉన్న భారతదేశపు మొట్టమొదటి టెక్ ఇంటిగ్రేటెడ్ అడ్వాన్స్డ్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ ప్లాట్‌ఫాంగా ఈ గుర్తింపునకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని సెంటర్ తెలిపింది. రాష్ట్ర క్రీడాశాఖ కార్యదర్శి జయేష్‌రంజన్ సంస్థ అందిస్తున్న అధునాతన సాంకేతిక కపరిజ్ఞానాన్ని, బహుళ విభాగాల విధానాన్ని, స్పోర్ట్స్ మెడిసిన్ విధానాలను ప్రశంసించారు. ఈసందర్భంగా సిఎస్ఎస్‌హెచ్ సహ వ్యవస్థాపకులు నరేష్ కుమార్ పగిడిమర్రి మాట్లాడుతూ "రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న అథ్లెట్లకోసం సిఎస్ఎస్‌హెచ్‌ను ఒక స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రంగా తెలంగాణ ప్రభుత్వం గుర్తించడం ఎంతో గౌరవంగా ఉంది."అని పేర్కొన్నారు.

## కొంపల్లిలో యోగా శిక్షకుడు అనుమానాస్పద మృతి

**పేట్ బషీరాబాద్, జులై 21, ప్రభాతవార్త**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి స్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్న యోగా శిక్షకుడు గుజ్జుల నరేష్ (31) మృతిచెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, కరీంనగర్‌కు చెందిన గుజ్జుల నరేష్ కొంపల్లిలో అద్దెకు ఉంటూ యోగా శిక్షకుడిగా పనిచేస్తున్నాడు. గత వారం రోజులుగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయన తల్లి గుజ్జుల లలిత జులై 20న పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అపార్ట్‌మెంట్‌కు చేరుకున్న పోలీసులు గది తలుపులు తెరిచి చూడగా నరేష్ మృతదేహం సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో నరేష్ కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని, గత ఏడాది తండ్రి మృతి చెందడంతో మరింత మనోవేదనకు లోనైనట్లు సమాచారం. అయితే మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక, దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## రౌడీ షీటర్‌పై పీడీ చట్టం

**సికింద్రాబాద్, జులై 21 ప్రభాతవార్త:**

చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే కరుడుగట్టిన రౌడీ షీటర్ బొజ్జ భాగ్యరాజ్‌పై (పీడీ) ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కింద నగర పోలీస్ కమిషనర్ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. చిల కలగూడ పోలీసుల వివరాల ప్రకారం చిలకలగూడ పోలీ స్టేషన్ పరిధిలో నివాసం ఉండే బొజ్జ భాగ్యరాజ్‌పై పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 15 క్రిమినల్ కేసులు ఉన్నాయి. పోక్సో చట్టంతో పాటు హత్యాయత్నం, అల్లర్లు, బెదిరింపులు, తీవ్ర గాయాలతో పాటు గతంలో రెండు సార్లు పీడీ చట్టం కింద నిర్బందించినప్పటికి ప్రవర్తన మారలేదు. ఇటీవల మూడు హత్యాయత్నం కేసులలో నిందితుడిగా ఉన్నాడు. బెయిల్‌పై విడుదల అయినప్పటికి కోర్టు షరతులను ఉల్లంగిస్తూ మళ్ళీమళ్ళీ నేరాలకు పాల్పడుతున్నాడు. శాంతి భద్రలకు ముప్పుగా మారిన తరుణంలో పోలీసులు పీడీ చట్టం కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశారు. పీడీ ప్రతిపాద నను చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ సిద్దం చేశారు. ఏసీపీ శశాంక్‌రెడ్డి, పర్యవేక్షణలో సికింద్రాబాద్ జోనల్ అడిషన్ డీసీపీ జె. నర్సయ్య సమగ్ర పర్యవేక్షణలో ఉత్తర్వులు అమలు చేసినట్లు డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు.